సాక్షి
ఏలూరు
సోమవారం ౹ 29 ౹ సెప్టెంబర్ ౹ 2025



వేటగాళ్ల మరణ మృదంగం
పక్షుల కిలకిలరావాలతో కళకళలాడే విహంగాల స్వర్గధామం కొల్లేరులో మరణ మృదంగం మోగుతోంది. వేటగాళ్లు విదేశీ పక్షులపై విరుచుకుపడుతున్నారు. 8లో



దిగుబడిపై దోమ'పోటు'
వరి పంటను ఆశిస్తున్న పురుగులు, తెగుళ్లతో దిగుబడులు తగ్గుతున్నాయి. సుడిదోమ వరి పంటను ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. 8లో



క్షేత్రంలో తగ్గని భక్తుల రద్దీ
ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రంలో ఆదివారం సైతం రద్దీ కొనసాగింది. సాధారణ భక్తులతో పాటు భవానీ దీక్షదారులు తరలివచ్చారు. 8లో

న్యూస్‌రీల్

గోపాలకృష్ణకి రాష్ట్రస్థాయి అవార్డు



సత్కారం అందుకుంటున్న ప్రకృతి వ్యవసాయ నిపుణుడు గోపాలకృష్ణ

చింతలపూడి: చింతలపూడికి చెందిన కిసాన్ అంగడి వ్యవస్థాపకుడు మరికంటి గోపాలకృష్ణ ఉత్తమ ప్రకృతి వ్యవసాయ విస్తరణ నిపుణుల రాష్ట్రస్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో తాను అవార్డు అందుకున్నట్టు గోపాలకృష్ణ ఆదివారం తెలిపారు. ఎనిమిదేళ్లుగా గోపాలకృష్ణ తన భూమిలోనే ప్రకృతి వ్యవసాయాన్ని అమలు చేస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు. కిసాన్ అంగడి ద్వారా ఆంధ్ర–తెలంగాణ రాష్ట్రాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ అవగాహన, శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం మీద నమ్మకంతో ముందుకు సాగుతున్న రైతులందరి విజయం ఈ అవార్డు అని, భవిష్యత్తులో మరింత మంది రైతులను ప్రకృతి వ్యవసాయం వైపు మళ్లించడానికి కృషి చేస్తానని గోపాలకృష్ణ అన్నారు.

డీఏలు విడుదల చేయాలి

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): ఉద్యోగ, ఉపాధ్యాయులు సకాలంలో డీఏలు, పీఆర్‌సీ ప్రయోజనాలు అందక ఇబ్బంది పడుతున్నారని ఏపీటీఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాళ్లూరి రామారావు, బి.రెడ్డి దొర ఓ ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఐఆర్, పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని కోరారు.

ముంపులో కనకాయలంక కాజ్‌వే



కనకాయలంక వద్ద పడవ మీద కాజ్ వే దాటుతున్న గ్రామస్తులు

యలమంచిలి: గోదావరిలో వరద ఉధృతి పెరగడంతో కనకాయలంక వద్ద కాజ్‌వే మునిగింది. కాజ్‌వేపై నుంచి సుమారు నాలుగడుగుల నీరు ప్రవహించడంతో అధికారులు ఇంజన్ పడవలు ఏర్పాటుచేశారు. ఈ ఏడాది వరదలకు కాజ్‌వే మునగడం ఇది నాలుగోసారి. ప్రస్తుతం భద్రాచలం వద్ద 43 అడుగుల నీరు ఉంది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరికలు వస్తున్న నేపథ్యంలో నాలుగు రోజుల వరకూ కాజ్‌వే ముంపులోనే ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

సిద్ధాంతంలో..
పెనుగొండ: వశిష్ట గోదావరి నిండుగా ప్రవహిస్తోంది. రెండు రోజుల్లో సుమారు ఏడడుగుల మేర నీరు పెరిగింది. సిద్ధాంతంలో కేదార్‌ఘాట్, పుష్కర ఘాట్లు పూర్తిగా మునిగిపోవడానికి కేవలం మూడు మెట్లు మాత్రమే ఉన్నాయి. వరద నీరు సిద్ధాంతం పుష్కరాల రేవులను పూర్తిగా ముంచెత్తింది. పడవలపై రాకపోకలు సాగించే లంక రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మధ్యస్థ లంకలోకి రాకపోకలు యథావిధిగా సాగుతున్నాయి.

నేవీ డిపోపై గిరిజన పోరు

- మూడుసార్లు గ్రామసభల్లో వద్దన్నా.. సర్కారు హడావుడి
- ఏలూరు జిల్లాలో 1,166 ఎకరాల భూసేకరణపై దృష్టి
- డిపో ఏర్పాటు చేసి తీరతామన్న ఎంపీ పుట్టా మహేష్ ప్రకటనతో రగడ
- సెక్షన్–30తో గిరిజనుల ఉద్యమాన్ని అణచాలని ప్రయత్నాలు
- ప్రజాభీష్టం మేరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపాదనల నిలిపివేత
- కూటమి సర్కారులో మళ్లీ గిరిజనుల్ని తరిమేసే ప్రణాళిక



మడకంవారిగూడెంలో నిరసన ర్యాలీ చేస్తున్న నేవీ ఆయుధ డిపో పోరాట వేదిక నాయకులు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, ఏలూరు : గిరిజనులు మళ్లీ పోరుబాట పట్టారు. ప్రశాంత జీవనం ఉన్న మా పల్లెల్లో నేవీ ఆయుధ డిపో వద్దంటూ తీవ్రస్థాయిలో నిరసన గళం విప్పారు. మూడుసార్లు నిర్వహించిన గ్రామసభల్లో ఆయుధ డిపో వద్దంటూ తీర్మానం చేశారు. అయినా సర్కారు మొండిగా ముందుకెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. ఏలూరు జిల్లాలో తలపెట్టిన ఈ నేవీ ఆయుధ డిపోపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో నిర్వహించిన గ్రామసభలో గిరిజనులు వ్యతిరేకించారు. దీంతో అప్పట్లో ఉన్నతాధికారులు ప్రజాభీష్టం మేరకు ఆ ప్రాజెక్టు ప్రతిపాదనల్ని నిలిపేస్తున్నట్లు ప్రకటించారు. కూటమి సర్కారులో మళ్లీ ఆ ఆయుధ డిపో ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం ప్రాంతంలో 1,166 ఎకరాల భూమిని సేకరించి నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చేస్తామని ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ చేసిన ప్రకటనతో గిరిజనులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. దీనిని నిరసిస్తూ గిరిజనులు ర్యాలీకి పిలుపునిస్తే సెక్షన్–30 అమలు చేసి ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం ప్రయత్నించటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేవీ డిపో ఏర్పాటుపై ఎంపీ సమావేశం
గత వారం ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వితో కలిసి కలెక్టరేట్‌లో నేవీ డిపో ఏర్పాటుపై సమావేశం నిర్వహించారు. 1,166 ఎకరాల భూమి సేకరించాలని, 30 ఎకరాల్లో డిపో ఏర్పాటు, మరికొంత స్థలంలో ఆస్పత్రి, స్కూల్, అధికారుల నివాసాలు ఉంటాయని, 2,500 మందికి పైగా స్థానికులకు ఉద్యోగాలిస్తామని ప్రజలకు నచ్చజెప్పాలని ఎంపీ సూచించారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఆధీనంలో ఉండే నేవీలో స్థానికంగా ఉద్యోగాలు ఎలా వస్తాయనే వాదనను గిరిజనులు తెరపైకి తెస్తే.. అధికారుల నుంచి స్పందన లేదు. తాజాగా గ్రామసభతో సంబంధం లేకుండా భూసేకరణకు సమాయత్తం అవుతుండటంపై గిరిజనులు, నేవీ ఆయుధ డిపో వ్యతిరేక పోరాట వేదిక (వామపక్షాలు) నేతలు పోరుబాట పట్టారు. ఆయుధ డిపో వద్దంటూ గత మంగళవారం ఆందోళన నిర్వహించారు. పోలీసు అధికారులు జీలుగుమిల్లి, టి.నర్సాపురం మండలాల్లో సెక్షన్–30 అమలు చేసి నిరసన ర్యాలీలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. గిరిజన, వామపక్ష నేతలను గృహనిర్బంధం చేశారు. మడకంవారిగూడెంలో నిరసనకారులకు, పోలీసులకు తోపులాట జరిగింది.

గిరిజనుల అభిప్రాయానికి విలువిచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

జీలుగుమిల్లి మండలం గిరిజన ప్రాంతం. 1,166 ఎకరాల్లో నేవీకి సంబంధించి ఆయుధ తయారీ డిపోను ఏర్పాటు చేయడానికి ఏలూరు జిల్లాలో గిరిజన ప్రాంతంలో భూములు గుర్తించాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. జీలుగుమిల్లి మండలంలోని వంకావారిగూడెం, రమణక్కపేట, దాట్లగూడెం, కొత్తచీమలవారిగూడెం, మడకంవారిగూడెం గ్రామాల పరిధిలో ఈ పరిశ్రమ ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అప్పటి అధికార యంత్రాంగం నిర్ధారించడంతో నేవీ ఉన్నతాధికారులు వచ్చి ఆ భూముల్ని పరిశీలించారు. దీనిపై 2023లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామసభ నిర్వహించగా నేవీ డిపో ఏర్పాటును గిరిజనులు వ్యతిరేకించారు. దీంతో ప్రభుత్వం ప్రజల అభీష్టానికి అనుగుణంగా పనిచేస్తుందని, అందువల్ల ఆయుధ డిపో ప్రతిపాదనలను నిలిపేస్తున్నామని ఉన్నతాధికారులు ప్రకటించారు. గతేడాది కూటమి ప్రభుత్వం రాగానే ఆయుధ డిపో వ్యవహారం మళ్లీ తెరపైకి వచ్చింది. ప్రధానంగా ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ వ్యక్తిగత ఆసక్తితో వేలాదిమంది గిరిజనులు వ్యతిరేకించినా ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని హడావుడి మొదలుపెట్టారు. దీనిలో భాగంగా గతేడాది అక్టోబర్ 27న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసుల నేతృత్వంలో గ్రామసభ నిర్వహించి అందరికీ ఉద్యోగాలు వస్తాయని, ఎలాంటి సమస్యా ఉండదని, ఉద్యోగాలన్నీ స్థానికులకే నేవీ ఇస్తుందంటూ రకరకాల మాటలతో నచ్చజెప్పాలని ప్రయత్నించారు. అయినా గిరిజనులు, ప్రజాసంఘాల వారు తీవ్రంగా వ్యతిరేకించారు. తరువాత మరోసారి గ్రామసభ నిర్వహిస్తే నేవీ డిపో వద్దంటూ ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు పేరుతో వేలేరుపాడు, కుక్కునూరు, పోలవరం మండలాల్లోని గిరిజనులు ఏజెన్సీకి దూరమయ్యారని, ఈ పరిశ్రమ పేరుతో జీలుగుమిల్లి మండలంలోని గిరిజనులను కూడా తరిమివేయవద్దంటూ నిరసన వ్యక్తం చేశారు.

నేవీ ఆయుధ డిపోను వ్యతిరేకిస్తున్నాం



జీలుగుమిల్లి మండలంలో నేవీ ఆయుధ డిపోను మొదటి నుంచి వ్యతిరేకిస్తున్నాం. ఇప్పటికే మూడుసార్లు గ్రామసభల ద్వారా డిపో ఏర్పాటు చేయవద్దని తీర్మానం చేశారు. భూసేకరణ జరిగిందని అధికారులు, ప్రజాప్రతినిధులు చెప్పడం అబద్ధం. గ్రామసభ జరగకుండా భూసేకరణ ఎలా చేస్తారు? ప్రజల అభిప్రాయాలను గౌరవించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయి.
– ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి

సబ్ జైలు సందర్శన



సబ్ జైలును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

భీమవరం: భీమవరంలో ప్రత్యేక సబ్ జైలును ఆదివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎస్.శ్రీదేవి, సంస్థ సెక్రటరీ కె.రత్నప్రసాద్ సందర్శించారు. ముద్దాయిలు కోరితే మండల న్యాయ సేవా సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ముద్దాయిలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. జైలులో ఏర్పాట్లపై ఆరా తీశారు. రోజూ యోగా చేస్తే మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. జైలు పరిసరాలను, మహిళా బ్యారక్‌ను, సోషల్ ఇంక్యుబేషన్ సెంటర్, ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని పరిశీలించారు. స్టోర్ రూమ్‌ను, వంటశాలను తనిఖీ చేసి, భోజనాన్ని రుచిచూశారు. జైలు సూపరింటెండెంట్ డి.వెంకటగిరి ఉన్నారు.

9 ఏళ్లుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు

- 138 ఎకరాల విస్తీర్ణంలో ఆస్తులపై చిక్కుముడి
- నూజివీడువాసుల ఇబ్బందులు

నూజివీడు: నూజివీడు నడిబొడ్డున ఉన్న 138 ఎకరాల్లోని నివేశన స్థలాలు, ఇళ్లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్‌లకు సంబంధించి రిజిస్ట్రేషన్లు జరగక పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిలిచిన పట్టణంలోని గ్రామకంఠం భూమి రిజిస్ట్రేషన్‌లు ఇప్పటికీ జరగడం లేదు. వక్ఫ్‌బోర్డు సూచనతో అప్పట్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఇష్టారాజ్యంగా పట్టణంలోని 450/1 సర్వే నంబర్‌లో 138 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గ్రామకంఠం భూమి రిజిస్ట్రేషన్లను నిలిపివేసింది. వక్ఫ్‌బోర్డుకు చెందిన భూమి ఏమైనా ఉంటే అంతవరకు చూసుకోవాలే తప్ప 138 ఎకరాల రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయించడమేమిటని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అవసరానికి అక్కరకు రాకుండా..
సర్వే నంబర్ 450/1లో ఉన్న భూమి ప్రైవేటు గ్రామకంఠం భూమి కాగా వందలాది గృహాలు, అపార్ట్‌మెంట్లు, ఖాళీ స్థలాలు ఉన్నాయి. రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో క్రయవిక్రయాలు జరగక ఆస్తి అవసరానికి అక్కరకు రావడం లేదని ఈ ప్రాంతవాసులు అంటున్నారు. ఆర్థిక కష్టాలు ఎదురైతే అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

ఎందుకు నిలిపివేశారంటే...
పట్టణంలోని కోనేరుపేట సమీపంలో వక్ఫ్‌బోర్డుకు చెందిన 2.50 ఎకరాల స్థలం ఉంది. ఈ స్థలాన్ని ఎవరైనా రిజిస్ట్రేషన్ చేయాలని ప్రయత్నించవచ్చని, దానిని ఎవరికీ రిజిస్ట్రేషన్ చేయవద్దని వక్ఫ్‌బోర్డు ఉన్నతాధికారులు 2016లో రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీకి లేఖ రాసింది. దీంతో ఆ సర్వే నంబర్‌లోని 138 ఎకరాల మొత్తం విస్తీర్ణంలోని స్థలాలన్నింటినీ రిజిస్ట్రేషన్ చేయడం నిలిపివేశారు.



రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన నూజివీడులోని ప్రాంతం

మాజీ ఎమ్మెల్యే అప్పారావు చొరవతో..
రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంతో మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు అప్పట్లోనే వక్ఫ్‌బోర్డు సీఈఓతో మాట్లాడి వారి తాలూకా భూమికి సబ్‌డివిజన్ చేయించమని తహసీల్దార్‌కు లేఖ పెట్టించారు. దీంతో రెవెన్యూ అధికారులు సబ్ డివిజన్ చేసి వక్ఫ్‌బోర్డు భూమికి సర్వే నంబర్ 450/7గా ఇచ్చి అందులో 79 సెంట్లు భూమి ఉన్నట్టు ఉత్తర్వులను తిరిగి పంపారు. ఇది జరిగి ఏడున్నరేళ్లు గడిచినా ఇప్పటికీ చలనం లేదు. భూములను రిజిస్ట్రేషన్ చేయాలని ఓ న్యాయవాది హైకోర్టుకు కూడా వెళ్లారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి పట్టించుకుని సమస్యను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

యువకుడిపై గంజాయి బ్యాచ్ దాడి

- తీవ్రగాయాలతో ఆస్పత్రిలో చికిత్స
- గ్రామస్తుల భారీ ఆందోళన.. విరమణ

సాక్షి, టాస్క్‌ఫోర్స్: భీమడోలులో శనివారం రాత్రి గంజాయి ముఠా రెచ్చిపోయి దాడి చేయడంతో ఈతకోట రవికిరణ్ అనే యువకుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ సంఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. బాధిత యువకుడిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రెండు నెలలుగా గ్రామంలో గంజాయి బ్యాచ్ పేట్రేగిపోతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఆందోళనకు దిగారు. భీమడోలు సీఐ యూజే విల్సన్ వారికి సర్దిచెప్పేందుకు రాగా ఆయన జీపును చుట్టుముట్టారు. 10 మంది గంజాయి ముఠా సభ్యుల్లో పలువురు రవికిరణ్‌పై ఇప్పటికే రెండుసార్లు దాడి చేసినా, చంపేస్తామని బెదరిస్తున్నట్టు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ గ్రామస్తులు మండిపడ్డారు. ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ ఇక్కడకు వచ్చి ఆందోళన విరమించాలని కోరగా సమస్య తీవ్రతను ఆయనకు తెలియజేశారు. చివరకు అల్లరిమూకలపై కేసులు నమోదుచేస్తామని ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రాత్రి 10.30 గంటల నుంచి వేకువజాము 2.30 గంటల వరకు ఆందోళన కొనసాగింది. అనంతరం గ్రామస్తుల ఫిర్యాదు మేరకు 10 మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ విల్సన్ తెలిపారు.

చవితి ఉత్సవాల్లో గొడవ ప్రారంభం
భీమడోలు గణపతి సెంటర్‌లో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా నిమజ్జనోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 6న పోలీసుల ఆదేశాలతో ఉత్సవ కమిటీ సభ్యులు డీజే సౌండ్స్‌ను నిలిపివేశారు. దీనిపై ఆగ్రహించిన కూటమి నాయకులు (గంజాయి బ్యాచ్) గుబ్బాల శివ, వణుకూరి బాలు, నందవరపు ప్రసాద్, ముదరబోయిన సుధాకర్, పిల్లి రాజశేఖర్, ఖాదా శ్రీను, ననుబోలు జగదీష్, రామకుర్తి సురేష్, ఆడపా మణికంఠ గంజాయి సేవించి ఉత్సవ కమిటీ సభ్యులను దుర్భాషలాడారు. దీనిపై అదేరోజు రాత్రి ఉత్సవ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో 7న ఉత్సవ కమిటీ సభ్యుడు ఈతకోట రవికిరణ్‌పై గుబ్బాల శివ, పిల్లి రాజశేఖర్, ఖాదా శ్రీను, ముదరబోయిన సుధాకర్ దాడి చేశారు. దీనిపై ఎంఎల్‌సీ కేసు నమోదైనా పోలీసులు చర్యలు తీసుకోలేదు. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి రవికిరణ్‌పై గంజాయి బ్యాచ్‌కు చెందిన ఇద్దరు రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.

గంజాయికి అడ్డాగా భీమడోలు
రాష్ట్రంలో గంజాయి తరలింపులో భీమడోలు రెండో స్థానంలో ఉన్నట్టు సోషల్ మీడియాలో ఓ మెసేజ్ చక్కర్లు కొడుతోంది. గంజాయికి అడ్డాగా భీమడోలు మారిందని, దీంతో విద్యార్థుల నుంచి యువత వరకూ గంజాయికి బానిసలవుతున్నారని పోలీసులకు పలు ఫిర్యాదులు అందాయి.

పోలీసుల అదుపులో నిందితులు
రవికిరణ్‌పై దాడికి కారణమైన 10 మంది యువకులపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారు. నిందితులు గుబ్బల శివకృష్ణ, జక్కంశెట్టి వీర వెంకట సత్యనారాయణ, ఖాజా శ్రీనివాసరావు, పిల్లి రాజశేఖర్, వణుకూరి బాలకృష్ణ, ముదరబోయిన సుధాకర్, నందవరపు ప్రసాద్, అడపా మణికంఠలను అదుపులోకి తీసుకున్నారు. నానుబోలు జగదీష్, రామిశెట్టి సురేష్ పరారీలో ఉన్నట్టు ఇన్‌చార్జి ఎస్సై సుధీర్ ఆదివారం రాత్రి తెలిపారు.



భీమడోలు సీఐ జీపును అడ్డుకుని రోడ్డుపై బైఠాయించిన గ్రామస్తులు, ఇన్‌సెట్‌లో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఈతకోట రవికిరణ్

దొంగలు బాబోయ్ దొంగలు

- జిల్లాలోకి మధ్యప్రదేశ్, రాజస్థాన్ గ్యాంగ్
- వరుస చోరీలతో ప్రజలు బెంబేలు
- అప్రమత్తంగా ఉండాలంటున్న పోలీసులు

తణుకు అర్బన్ : చీకటిపడితే చాలు ఇంటి తలుపులు భద్రంగా వేసుకున్నా దొంగల భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దాడులు చేసి కొందరు, భయపెట్టి మరికొందరు దొంగలు దొరికినకాడికి దోచుకుపోతూ బెంబేలెత్తిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లతో పాటు ఒంటరిగా ఉన్న మహిళలు, వృద్ధుల ఇళ్లపై తెగబడుతూ చోరీలకు పాల్పడుతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నెల రోజుల వ్యవధిలో జరిగిన పలు చోరీ సంఘటనలు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.

భయాందోళనలో వృద్ధులు
ఇటీవల దొంగల ప్రస్తావన వస్తుండటంతో ఒంటరిగా ఉంటున్న వృద్ధులు భయాందోళన చెందుతున్నారు. దొంగలు డబ్బు, ఆభరణాలు అపహరించడంతో పాటు దాడులు చేయడంతో భయపడుతున్నారు. ముఖ్యంగా దొంగలు బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారు. ఇటీవల బంగారం ధరలు ఆకాశాన్నంటడంతో దొంగలు వీటిపై దృష్టి సారించారు. తణుకులో వాచ్‌మెన్‌ను తీవ్రంగా గాయపరచడంతో దుకాణాలు, సంపన్నుల ఇళ్లకు వాచ్‌మెన్‌లుగా ఉన్న వృద్ధులు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు.



తణుకులో సీసీ పుటేజీలో అనుమానితులు

చోరీల్లో కొన్ని..
- తణుకులో ఈనెల 26న రాత్రి వృద్ధురాలు ఒంటరిగా ఉన్నారన్న పక్కా సమాచారంతో ఇంట్లోకి చొరబడి 70 కాసుల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదు దోచుకుపోయా రు. దొంగలను చూసి భయపడిన వృద్ధురాలు తననేమీ చేయవద్దని ఇంట్లో దాచుకున్నవి, ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు సైతం స్వయంగా ఇవ్వాల్సిన పరిస్థితి.
- ఈనెల 23న రాత్రి జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామంలో ముగ్గురు దొంగలు ఒంటరిగా ఉంటున్న వృద్ధ దంపతుల ఇంట్లోకి ప్రవేశించి వారిపై దాడి చేసి, కాళ్లూ చేతులు కట్టి అందిన కాడికి దోచుకుపోయారు.
- ఈనెల 20న రాత్రి తణుకు సజ్జాపురంలోని జ్యూపిటర్ ఎగ్ ట్రేడర్స్ కార్యాలయంలో విధుల్లో ఉన్న వాచ్‌మెన్‌ను తీవ్రంగా గాయపరిచి రూ.లక్ష నగదు దోచుకున్నారు.
- ఈనెల 15న ఏలూరులో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న మహిళపై ఒక అగంతకుడు కత్తితో తీవ్రంగా దాడి చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకుపోయాడు.

పోలీసుల హెచ్చరికలు
జిల్లాలో మధ్యప్రదేశ్, రాజస్థాన్‌కు ఆరుగురు అంతర్జాతీయ దొంగల ముఠా సంచరిస్తున్నట్టు సమాచారం ఉందని పోలీసులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ నెలలో సదరు గ్యాంగ్ నెల్లూరు జిల్లా కావలి, కాకినాడ జిల్లా పత్తిపాడు, తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో చోరీలకు తెగబడిందని చెబుతున్నారు. వీరంతా తక్కువ అద్దె ఉన్న లాడ్జీల్లో తలదాచుకుంటూ పగలు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు నేరాలకు పాల్పడుతున్నారని, అనుమానాస్పదంగా వ్యవహరించే వారి సమాచారాన్ని 112కి ఫోన్ చేసి తెలియజేయాలని పోలీసులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా పోలీసు అధికారులు రాత్రిళ్లు ప్రత్యేక నిఘా పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రి పదవి కోసమే జగన్‌పై కామినేని ఆరోపణలు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీ వేదికగా తిడితే సీఎం చంద్రబాబు కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు మంత్రి పదవి కేటాయిస్తారనే భ్రమలో ఉన్నారని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విమర్శించారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశంలో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌తో కూడిన ప్లకార్డులను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కూటమి పాలనలో జరిగే ప్రతి అన్యాయం, అక్రమాలు, మైనింగ్‌లను డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. డిజిటల్ బుక్ పోర్టల్‌లో ఫొటోలు, ఆధారాలు, అప్‌లోడ్ చేసేందుకు అవకాశం ఉందన్నారు. దీనిలో ఐవీఆర్‌ఎస్ నంబరు 040–49171718 కాల్ చేసి ఫిర్యాదులు చేయవచ్చన్నారు.

డీఎన్నార్ పేరు చెబితే కామినేనికి నిద్ర పట్టడం లేదు
తన పేరు చెబితే ఎమ్మెల్యే కామినేనికి నిద్రపట్టం లేదని డీఎన్నార్ అన్నారు. అసెంబ్లీలో మంత్రి పదవి కోసం కాకా పట్టడం కోసమే వైఎస్ జగన్‌పై కామినేని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. వీటిపై విదేశాల్లో ఉన్న చిరంజీవి స్పష్టత ఇవ్వడంతో కామినేని పన్నాగం అర్థమయిందన్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణకు మంత్రి పదవి కేటాయించకపోవడం, డిప్యూటీ పవన్ కల్యాణ్‌కు ఉన్న గన్‌మెన్లు, బౌన్సర్లు చూసి తట్టుకోలేక సైకోలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. అసలు ఈ గొడవలకు ప్రధాన కారణం కామినేని శ్రీనివాస్ అని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధనరావు, పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ, ముదినేపల్లి ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎస్సీ సెల్ రాష్ట్ర నాయకులు గుమ్మడి వెంకటేశ్వరరావు, జిల్లా ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగ అధ్యక్షుడు ఎలుగుల వేణుగోపాలరావు, మండల పార్టీ అధ్యక్షుడు శింగంశెట్టి రాము, నాయకులు పాల్గొన్నారు.



కైకలూరులో డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

వేటగాళ్ల మరణ మృదంగం

- కొల్లేరులో నాటు తుపాకులకు విహంగాల బలి
- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- చేతులెత్తేసిన అటవీశాఖ అధికారులు

కైకలూరు: ప్రకృతి సౌందర్యాలకు నిలయమైన కొల్లేరు సరస్సు.. పక్షుల కిలకిలరావాలతో కళకళలాడే విహంగాల స్వర్గధామం. ఇప్పుడు ఆ స్వర్గంలో మరణమృదంగం మోగుతోంది. వేటగాళ్లు విదేశీ పక్షులపై విరుచుకుపడుతున్నారు. తుపాకీ గుండ్లతో మూగజీవాల గుండెలను చీల్చేస్తూ, వలల ఉచ్చులతో ఊపిరి తీయకుండా చేస్తున్నారు. అటవీ అభయారణ్య చట్టాలు కేవలం పుస్తకాలకే పరిమితమైపోయాయి. నియంత్రించాల్సిన అధికారుల కళ్లముందే వేటగాళ్ల దౌర్జన్యం పెరుగుతోంది. కూటమి ప్రభుత్వంలో మరింత బరితెగించి కొల్లేరు ఒడిలో సేదతీరుతున్న పక్షుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

చెరువులపై వాలితే ఆయువు తీరినట్లే

ఆక్వా చెరువులపై వాలిన అరుదైన పక్షి జాతులు సైతం వేటగాళ్ల నాటు తుపాకులకు బలవుతున్నాయి. రాష్ట్రంలో 5.75 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు జరుగుతుండగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ విస్తీర్ణం 2.90 లక్షల ఎకరాలుగా ఉంది. ఎక్కువ విస్తీర్ణం కలిగిన చేపల రైతులు సాగు ప్రారంభంలో చేప పిల్లలను పక్షులు తినకుండా నాటు తుపాకుల వేటగాళ్లను నియమించుకుంటారు. ఇందుకోసం తమిళనాడు, సూళ్లూరుపేట నుంచి వచ్చిన దాదాపు 150 కుటుంబాలు కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. తుపాకీతో ఒక్క పక్షిని చంపితే వీరికి రూ.200 నుంచి రూ.300 వరకూ పనికి తీసుకెళ్లిన చెరువు రైతులు చెల్లించాలి. ఈ క్రమంలో కొల్లేరులో సంచరించే పక్షులు చెరువులపై వాలితే వేటగాళ్లు కాల్చేస్తున్నారు. చేపలు పెద్దవైన తర్వాత సైతం వేటగాళ్లు తమ పక్షుల వేటను కొనసాగిస్తుండడం గమనార్హం. నాటు తుపాకుల మందు పేలి అనేక మంది వేటగాళ్లు మరణించిన ఘటనలు కొల్లేరు ప్రాంతంలో చోటుచేసుకోవడం గమనార్హం.



కొల్లేరులో విహరిస్తున్న పక్షుల గుంపులు

కొల్లేరు సరస్సు ముఖ్యాంశాలు
ప్రాంతం: 901 చ.కి.మీ.
విస్తీర్ణం: 2,22,300 ఎకరాలు
అభయారణ్యం: 77,138 ఎకరాలు (9 మండలాలు)
గ్రామాలు: 122
జనాభా: 3.50 లక్షలు
విహరించే పక్షి జాతులు: 182
వలస పక్షులు: ప్రత్యేక ఆకర్షణ



నిడమర్రులో వేటగాళ్ల చేతిలో మృతి చెందిన గ్లోసీ ఐబిస్ పక్షులు



గుడివాకలంకలో మృతిచెంది పట్టుబడిన కొల్లేరు పక్షులు



వేటగాళ్ల గుళికలకు మరణించిన కొల్లేరు జమ్ముకోడి పక్షులు (ఫైల్)

అక్రమ వేటకు ఎన్నో ఆనవాళ్లు..

- గుడివాకలంక, నిడమర్రు, అడవి కొలను, శృంగవరప్పాడుతో పాటు నడికొల్లేరులోని అనేక ప్రాంతాల్లో వేట సాగిస్తున్నారు.
- ఆగస్టు 29న ఏలూరు జిల్లా గుడివాకలంక వద్ద కొల్లేరు పక్షులను వేటాడి తెస్తున్న వ్యక్తిని ఫారెస్టు సిబ్బంది పట్టుకున్నారు. కైకలూరు మండలం కొల్లేటికోట ప్రాంతంలో వేటాడానని అతను చెప్పాడు. ఇదే ప్రాంతంలో కొన్ని నెలల క్రితం బతికి ఉన్న పక్షుల తీసుకెళ్తున్న ఒకరిని పట్టుకున్నారు. కేసు నమోదు చేసి మేజిస్ట్రేట్ తీర్పుతో పక్షులను వదిలేశారు.
- సెప్టెంబర్ 4న నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం చేపల మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన 13 మృతి చెందిన పక్షులను, ఏడుగురు వేటగాళ్లను, 3 నాటు తుపాకులను భీమవరం ఫారెస్టు సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు.
- కొద్దిరోజుల క్రితం వేటగాళ్లు గుళికలతో చంపిన గ్లోసి ఐబీస్ కొల్లేరు పక్షుల ఫొటోలు సామా

వేటకు గురవుతున్న ప్రధాన పక్షులు

- పర్ఫ్యూల్ శాంఫన్ (కొండింగాయి)
- కామన్ మోర్‌హెన్ (జమ్ముకోడి)
- కామన్ కూట్ (నామాల కోడి)
- టీల్ (పరజా)
- గ్లోసీ ఐబీస్ (నల్ల కంకణాల పిట్ట)
- విజిటింగ్ టీల్ (సిలువ బాతులు)
- గ్రేహెరాన్ (నారాయణ పక్షి)
- కార్మోరెంట్ (నీటి కాకులు)

నిఘా ముమ్మరం



కొల్లేరు ప్రాంతంలో పక్షుల వేటగాళ్లపై నిఘాను ముమ్మరం చేశాం. వన్యప్రాణి సంరక్షణ చట్టం 1972 ప్రకారం వేటాడినా, వాటి ఆవాసాలను నాశనం చేసినా, అభయారణ్యంలో ప్రవేశించినా నేరంగా పరిగణిస్తాం. రెండేళ్ల జైలు, రూ.20 వేల జరిమానాతో పాటు రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాల్సి ఉంటుంది. నాటు తుపాకులతో అభయారణ్యంలో ప్రవేశం నేరం.

-కె.రామలింగాచార్యులు, జిల్లా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్, ఏలూరు

క్లుప్తంగా

సుబ్బారాయుడిని దర్శించుకున్న భక్తులు



సుబ్బారాయుడిని దర్శించుకుంటున్న భక్తులు

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్వామి పుట్టలో పాలు పోశారు. పాలపొంగళ్లశాల వద్ద మహిళలు నైవేద్యాలు తయారుచేసి స్వామికి సమర్పించారు. నాగబంధాల వద్ద స్వామి మూర్తులను ప్రతిష్ఠించేందుకు అర్చకులతో పూజలు చేయించి ప్రతిష్ఠ తంతు నిర్వహించారు. నాగబంధాల వద్ద, గోకులంలోని గోవులకు మహిళలు పసుపుకుంకుమలతో పూజలు చేశారు.

రోడ్డుకు మరమ్మతులు



ఎన్నార్పీ అగ్రహారంలో రోడ్డు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్

ఉండి: ఈ నెల 17న 'ప్రయాణమంటే కలవరమే' అనే శీర్షికన ప్రచురితమైన సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. ఎన్నార్పీ అగ్రహారం ఎస్సీ కాలనీలోని రోడ్డు మరమ్మతు పనులను ఆదివారం పంచాయితీ అధికారులు ప్రారంభించారు. గ్రామాల్లో అంతర్గత రోడ్ల దుస్థితిపై ప్రజలు ఆవేదనను తెలియచేస్తూ ప్రచురితమైన కథనానికి అధికారుల్లో కదలిక వచ్చింది. పలు గ్రామాల్లో ఇప్పటికీ మట్టిరోడ్లు దర్శనమివ్వడంతో ఆయా ప్రాంతాలు పడుతున్న ఆవేదన అర్థమయ్యేలా కథనం ప్రచురితమైంది.

చెరువులో పడి వృద్ధుడి మృతి

ముసునూరు: బహిర్భూమికి వెళ్ళిన వృద్ధుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ఎస్సై ఎం.చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చిల్లబోయినపల్లికి చెందిన వృద్ధుడు భీమడోలు జయరాజు(64) ఆదివారం ఉదయం గ్రామంలోని ఎస్సీ ఏరియాకు సమీపంలో ఉన్న పెద్ద చెరువుకు బహిర్భూమికి వెళ్ళాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడి మృతి చెందాడు. స్థానికులు ముసునూరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఏఎస్ఐ బేగ్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెరువులో నుంచి వెలికి తీయించారు. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు.

ఆహ్లాదం.. ఆటపాక పక్షుల కేంద్రం



పక్షుల విహార కేంద్రంలో బోటు షికారు

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామం ఆటపాక పక్షుల విహార కేంద్రంలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. ఏలూరు, కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల నుంచి పక్షి ప్రేమికులు తరలివచ్చారు. బోటు షికారు చేస్తూ పెలికాన్, పెయింటెడ్ స్టాక్ పక్షుల కేరింతలను దగ్గరుండి వీక్షించారు. సమీపంలో పక్షి నమూనా మ్యూజియంలో పక్షుల విశేషాలను యాత్రికులు తెలుసుకున్నారు. చిల్డ్రన్స్ పార్కులో చిన్నారులు ఆడుకున్నారు. అటవీ సిబ్బంది కొల్లేరు అభయారణ్యం ప్రాముఖ్యత, పక్షుల విశేషాలను వివరించారు. ఫారెస్టు డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ రంజిత్‌కుమార్ మాట్లాడుతూ పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇటీవల నూతన బోటును అందుబాటులోకి తెచ్చామన్నారు.

యూపీఎస్సీ శిక్షణకు 27 మంది ఎంపిక

నూజివీడు: యూపీఎస్సీ ప్రత్యేక శిక్షణ కోసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత నెలలో నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో నిర్వహించిన విద్యార్థుల ఎంపిక పరీక్షలో 27 మంది ఎంపికయ్యారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడైన కోనం సందీప్ ఆర్జీయూకేటీ పూర్వ విద్యార్థి కావడంతో ఇక్కడి విద్యార్థుల ఎంపిక కోసం పరీక్షను నిర్వహించారు. ఇంజినీరింగ్ ద్వితీయ సంవత్సరం నుంచి నాలుగో సంవత్సరం వరకు మొత్తం 266 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవగా వారిలో 27 మంది ప్రత్యేక శిక్షణ కోసం ఎంపికయ్యారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ నుంచి ఏడుగురు, ఇడుపులపాయ నుంచి తొమ్మిది మంది, ఒంగోలు నుంచి ఏడుగురు, శ్రీకాకుళం నుంచి నలుగురు ఎంపికయ్యారు. వీరికి కావాల్సిన శిక్షణ, మార్గదర్శనం, వనరులను కోనం ఫౌండేషన్ ఉచితంగా శిక్షణ అందజేస్తుంది. ఎంపికైన విద్యార్థులను చాన్సలర్ ఆచార్య కే మధుమూర్తి, వీసీ ఆచార్య విజయకుమార్, రిజిస్ట్రార్ ఆచార్య సంద్ర అమరేంద్ర కుమార్, సెంట్రల్ ఏఓ బండి ప్రసాద్, సెంట్రల్ డీన్ దువ్వూరు శ్రావణి తదితరులు అభినందించారు.

శ్రీవారి కొండపై విష సర్పాల భయం



శ్రీవారి కొండపైన సిబ్బంది క్వార్టర్స్ ప్రాంతంలో హతమైన పొడ పాము

ద్వారకాతిరుమల: శ్రీవారి కొండపై విష సర్పాల సంచారం అధికమైంది. దాంతో భక్తులు, క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న కొందరు దేవస్థానం సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఆదివారం రాత్రి క్వార్టర్స్ ప్రాంతంలోకి ఒక భారీ పొడ పాము, తాచు పాము వచ్చాయి. స్థానికులు వాటిలో పొడ పామును హతమార్చగా, తాచుపాము పొదల్లోకి వెళ్లిపోయింది. కొండపైన దట్టంగా పొదలు పెరగడం వల్ల పాముల సంచారం ఎక్కువగా ఉందంటున్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూలాలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి: నవరాత్రులు పురస్కరించుకుని శ్రీ రాట్నాలమ్మ దేవస్థానం భక్తులతో కిటకిటలాడింది. రాట్నాలకుంటలో వేంచేసిన శ్రీ రాట్నాలమ్మకు ప్రీతికరమైన రోజు కావడంతో జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పూజలు నిర్వహించి, మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ వారం పూజా టిక్కెట్లపై రూ.39,450, విరాళంపై రూ.7,069, లడ్డూ ప్రసాదంపై రూ.18,975, ఫొటోల అమ్మకంపై రూ.2,130 కలిపి మొత్తం రూ.67,624 ఆదాయం లభించిందని ఈవో తెలిపారు.

● ధనలక్ష్మిగా దుర్గాదేవి



పాలకొల్లు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో దుర్గాదేవిని ఆదివారం ధనలక్ష్మిగా అలంకరించారు. ఈ సందర్భంగా రూ.1.40 కోట్ల విలువైన నోట్లతో అమ్మవారిని అలంకరించారు.

-పాలకొల్లు సెంట్రల్

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ

కైకలూరు: పెద్దింట్లమ్మ దేవస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. సమీప జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మను దర్శించుకున్నారు. పవిత్ర కోనేరులో స్నానాలు ఆచరించి పెద్దింట్లమ్మకు పొంగళ్లు సమర్పించారు. ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, కేశఖండన, పెద్ద, చిన్న తీర్థాలు, లడ్డూ ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి ఫొటోల అమ్మకం, వాహన పూజలు, భక్తుల విరాళాల ద్వారా రూ.33,675 ఆదాయం వచ్చిందని చెప్పారు. భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించామని ఈవో చెప్పారు.

కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల పూజలు →



క్షేత్రంలో కొనసాగిన రద్దీ



శ్రీవారి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు




భక్తులతో నిండిన కుంకుళ్లమ్మ ఆలయం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో ఆదివారం సైతం భక్తుల రద్దీ కొనసాగింది. దసరా ఉత్సవాలు సందర్భంగా విజయవాడ దుర్గమ్మను దర్శిస్తున్న భవానీ దీక్షాదారులు నేరుగా చిన్నతిరుపతికి చేరుకుంటున్నారు. దాంతో కొండపైన, ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. దర్శనం క్యూలైన్లు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, కేశఖండనశాల తదితర విభాగాలు భక్తులతో పోటెత్తాయి. సెల్‌ఫోన్లు భద్రపరచే కౌంటర్ వద్ద భక్తులు బారులు తీరారు. తిరుగు ప్రయాణంలో వారంతా క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ ఆలయాన్ని సందర్శిస్తున్నారు. రాత్రి వరకు క్షేత్రంలో భక్తుల రద్దీ కొనసాగింది.

న్యాయవాది అదృశ్యంపై కేసు నమోదు

తణుకు అర్బన్: తణుకు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాది తిర్రే సత్యనారాయణరాజు అదృశ్యమైనట్లు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీస్ స్టేషన్ ఏఎస్సై సత్యనారాయణ తెలిపారు. ఈ నెల 24 నుంచి సత్యనారాయణరాజు కనిపించడంలేదని, సోదరుడు ఫిర్యాదు నేపథ్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. తాడేపల్లిగూడెంకు చెందిన మడుగుల సురేష్ ఈనెల 23 నుంచి అదృశ్యమయ్యాడని అతని సోదరి ప్రశాంతి ఫిర్యాదు మేరకు ఇప్పటికే నమోదైన కేసుకు సంబంధించి సదరు న్యాయవాదిపై యువకుడి కుటుంసభ్యులు పలు ఆరోపణలు చేస్తున్నారు.

దిగుబడిపై దోమ 'పోటు'



పాడి - పంట

మండవల్లి: వరి పంటను ఆశిస్తున్న పురుగులు, తెగుళ్లతో దిగుబడులు తగ్గుతున్నాయి. సుడిదోమ వరి పంటను ఆశించి తీవ్ర నష్టాన్ని కలుగజేస్తుంది. వివిధ రకాల వైరస్ వ్యాధులను కారణమవుతోంది. దీని నివారణకు తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

గోధుమ రంగు సుడి దోమ: గోధుమ రంగు దోమ నీటి వసతి గల ప్రాంతంలో పంటను ఎక్కువగా ఆశిస్తుంది. తల్లి పురుగులు గోధుమ వర్ణం నుంచి ముదురు గోధుమ వర్ణంలో ఉంటాయి.

నష్టం: పిల్ల, తల్లి దోమలు కాండంలోని పోషకాలు సరఫరా చేసే కణజాలం నుంచి రసాన్ని పీల్చడం వల్ల పంట క్రమేపి పసుపు రంగుకు మారుతుంది. దీంతో ఎదుగుదల కోల్పోయి గిడస బారిపోతుంది. ఆలస్యంగా పిలకలు వేస్తాయి. అలాగే పిలకల నుంచి వచ్చిన వెన్నులో గింజలు సరిగా రావు. తెల్ల మచ్చ దోమల ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఇవి వెన్నును కూడా ఆశిస్తాయి. ఎక్కువ విస్తీర్ణంలో సుడి తెగులులా వ్యాపించడంతో పొలం అంతా ఎండిపోతుంది. నత్రజని ఎరువులు ఎక్కువ మోతాదులో వాడటం, పొటాష్ ఎరువులు వాడకపోవడం, నీటి యాజమాన్య పద్ధతులు సరిగా పాటించకపోవడం వల్ల ఈ దోమ వ్యాపిస్తుంది.

యాజమాన్యం: దోమలను తట్టుకునే రకాలను సాగు చేయాలి. ఇంద్ర(ఎంటీయూ 1061), శ్రీద్రుతి (ఎంటీయు 112), చంద్ర (ఎంటీయూ 1153) తరంగిణి రకాలు సాగుచేయాలి.

సుడులు సుడులుగా ఎండిపోవడాన్ని సుడితెగులు అని పిలుస్తారు. దోమ ఉధృతి ఎక్కువగా ఉంటే సుడులు ఒకదానితో ఒకటి కలిసి చేనంతా ఎండిపోతుంది. అలాంటి పరిస్థితులో దిగుబడి తగ్గుతుంది.

తెల్ల వీపు మచ్చ దోమ: దోమ శరీరం తెల్లగా ఉండి ఉదరం మాత్రం నల్లగా ఉంటుంది. రెక్కల మధ్య స్పష్టమైన తెల్లటి మచ్చ ఉంటుంది. ఈ కారణంగా దీనిని తెల్ల వీపు మచ్చ దోమ అంటారు.



గోధుమ రంగు సుడిదోమ ఆశించిన పైరు



ఎబి తెల్ల వీపు మచ్చ దోమ ఆశించిన పైరు

నష్టం: పిల్ల, తల్లి దోమలు కాండంలోని మొక్కలకు పోషకాలు సరఫరా చేసే కణజాలం నుంచి రసాన్ని పీల్చడం వల్ల మొక్కలు పసుపు రంగుకు మారి, ఎదుగుదల కోల్పోయి గిడసబారి పోతాయి. ఆలస్యంగా పిలకలు వేస్తాయి. పిలకల నుంచి వచ్చిన వెన్నులో గింజలు సరిగా రావు. తెల్ల మచ్చ దోమ వల్ల ఎక్కువ విస్తీర్ణంలో సుడి తెగులు వ్యాపించి, పొలం అంతా ఎండిపోతుంది.

- నత్రజని ఎక్కువ మోతాదులో వాడటం, పొటాష్ ఎరువులు వాడకపోవడం, నీటి యాజమాన్యం సరిగా లేకపోవడం ఉధృతికి కారణాలు
- దోమ నివారణకు అంకురం ఏర్పడే దశలో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు ఒక ఎకరానికి వేయాలి.

బుడతడే గానీ ఘటికుడు



ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్‌తో జెస్విన్ ప్రసాద్

పాలకొల్లు సెంట్రల్: ఈ బుడతడు.. ప్రపంచంలో 78 దేశాల జాతీయ జెండాలను గుర్తిస్తాడు. తన టాలెంట్‌తో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లోకి ఎక్కాడు. పాలకొల్లు పట్టణంలోని 18వ వార్డు పిన్నివారి వీధిలో ఉంటున్న శ్రీఖాకొళ్లపు రాజేష్, లలిత దంపతుల పెద్ద కుమారుడు జెస్విన్ ప్రసాద్. లలితకు చదువుపై మక్కువ కావడంతో పిల్లాడిని కూడా అలాగే తీర్చిదిద్దాలనే సంకల్పంతో అతనికి ఆరు నెలలు వచ్చేసరికి ఇతర దేశాల జాతీయ జెండాలను చూపిస్తూ శిక్షణ ఇచ్చేది. జాతీయ జెండాలతో పాటు, వాహనాలు, జంతువులు, పండ్లు, పక్షులు ఇలా 300 పదాల వరకూ నేర్పించారు. ఏదైనా వస్తువు పేరు, ఆట పేరు, వ్యక్తుల పేర్లు చెపితే వాటిని చూపిస్తాడు. ఇంగ్లీషు, తెలుగులో చెబుతాడు. పిల్లాడికి నేర్పించేందుకు ప్రత్యేక కార్డులు తయారుచేశారు. జెస్విన్ టాలెంట్‌ను చిత్రీకరించి గిన్నిస్ బుక్ ఇంటర్నేషనల్ రికార్డ్స్, సూపర్ టాలెంటెడ్ కిడ్ పోటీలకు దరఖాస్తు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్ పిల్లాడి ప్రతిభను గుర్తిస్తూ ప్రశంసాపత్రాన్ని పంపించారు.

పేకాట స్థావరంపై దాడి

భీమవరం: భీమవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. దీనికి సంబంధించి వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పాలకొల్లు రోడ్డులోని 4 సీజన్స్ అపార్ట్‌మెంట్‌లో పేకాట నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు 11 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.75,130 స్వాధీనం చేసుకున్నట్లు నాగరాజు తెలిపారు.

కారు ఢీకొని భార్యాభర్తలకు గాయాలు

భీమవరం: మోటార్‌సైకిల్‌ను కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఎస్సై రెహమాన్ తెలిపిన వివరాల ప్రకారం కాళ్ల మండలం పెదఅమిరం గ్రామానికి చెందిన ఎస్.నాగరాజు, ధనలక్ష్మి దంపతులు మోటార్ సైకిల్‌పై భీమవరం వచ్చి తిరిగి వెళుతుండగా భీమవరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జువ్వలపాలెం రోడ్డు అడ్డవంతెన వద్ద కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో మోటార్‌సైకిల్‌పై వెళుతున్న భార్యభర్తలు నాగరాజు, ధనలక్ష్మి గాయపడ్డారు. బాధితుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రెహమాన్ చెప్పారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పెదవేగి: పేకాడుతున్న ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ప్రకారం.. విజయరాయిలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,070 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.